క్లుప్తంగా

నేడు తలుపులమ్మతల్లికి శాకంబరి అలంకరణ

తుని రూరల్: లోవ దేవస్థానంలో భక్తుల కోరిన కోర్కెలు తీర్చే తలుపులమ్మ అమ్మవారు ఆదివారం శాకంబరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఆషాఢ మాసోత్సవాల్లో భాగంగా వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరిస్తామని ఆలయ ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు శనివారం తెలిపారు.

ఘనంగా విష్ణు, లలితా సహస్రనామ పారాయణలు

ఏలేశ్వరం: స్థానిక శివాలయంలో శనివారం విశ్వ హిందూ పరిషత్ అనుబంధ మాతృశక్తి, దుర్గావాహిని మహిళాసంఘాల ఆధ్వర్యంలో విష్ణు, లలితాసహస్ర నామ పారాయణలు చేశారు. అనంతరం భక్తిగీతాలు ఆలపించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ప్రతినిధులు ఏడీవీ ప్రసాద్, కటకం కిరిటీ, సంఘ మహిళా సభ్యులు పాటోలు దేవి, మల్లేశ్వరి, ఇందిరా, పద్మజ, రమాదేవి, రమ్య తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

ఏలేశ్వరం: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకుని శనివారం పేరవరంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి ఆర్థిక సహకారంతో మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు పేదలకు దుప్పట్లు పంచారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కొప్పుల బాబ్జీ, వెన్నా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బెల్లపు ఊట ధ్వంసం

గండేపల్లి: మండల పరిధిలోని గ్రామాల్లో సారా తయారీ కేంద్రాలపై దాడి చేసి 1000 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు స్థానిక సీఐ బి.సూర్యఅప్పారావు శనివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. కాకినాడ జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ జి.ప్రేమ్‌కాజల్ ఆదేశాల మేరకు ఎన్టీ రాజాపురం శివారు అటవీ ప్రాంతంలో సారా తయారీ కేంద్రాలపై పోలీసులు, ఎస్ఈబీ సిబ్బంది దాడులు చేశారు. ఈ దాడుల్లో సారా తయారీ కోసం డ్రమ్ముల్లో సిద్ధంగా ఉంచిన 1000 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. పలువురి నిందితులపై కేసులు నమోదు చేశారు. ఈ దాడుల్లో కాకినాడ ఎస్ఈబీ సీఐ సునీల్ కుమార్, పెద్దాపురం ఎక్సైజ్ సీఐ దిలీప్, ఐడబ్ల్యూ సీఐ గిరిధర్, డీటీఎఫ్ ఎస్సై విజయ్ కుమార్, ఈసీ డీటీఎఫ్‌లు నవీన్, గంగాధర్, వినయ్ కుమార్, గండేపల్లి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ

ప్రత్తిపాడు: స్థానిక బజారు వీధి రామాలయం వద్ద శనివారం నిరుపేద విద్యార్థులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. సదా మీ సేవలో (ఎస్ఎంఎస్) స్వచ్ఛంద సంస్థ సమకూర్చిన పౌష్టికాహార కిట్లను శ్రీషిర్డీసాయి జ్యూయలరీస్ అధినేత పడాల శ్రీనివాసరెడ్డి విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎంఎస్ సంస్థ సభ్యులు గొందేసి సత్యానందం, శిరసాల మణికంఠ జ్యోతి, లక్ష్మి పాల్గొన్నారు.

వీధికుక్క దాడిలో బాలుడికి గాయాలు

రౌతులపూడి: మండలంలోని ఎ.మల్లవరంలో లెక్కల రాము కుమారుడు ధ్రువపై శనివారం వీధికుక్క దాడి చేసింది. ఈ దాడిలో గాయపడిన బాలుడు ధ్రువను రౌతులపూడి సీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు.

దివంగత ఎంపీపీ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

తొండంగి: మండలంలోని ఒంటిమామిడి పంచాయతీ కొత్తపాకలులో ఇటీవల మృతి చెందిన ఎంపీపీ అంగుళూరి అరుణ్‌కుమార్ విగ్రహం ఏర్పాటుకు శనివారం వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, ఇతర నాయకులు భూమి పూజ చేశారు. ఎంపీపీగా అంగులూరి అరుణ్ కుమార్ చేసిన సేవలకు గుర్తుగా గ్రామంలోని ప్రధాన సెంటర్ వద్ద విగ్రహం ఏర్పాటు చేస్తున్నారు. పార్టీ నాయకులు నాగం గంగబాబు, మేరుగు ఆనందహరి, గాబు రాజు, ఎంపీపీ అరుణ్‌కుమార్ సతీమణి అంగుళూరి సుశీల, సర్పంచ్ అంగుళూరి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

లోన్ యాప్ మోసాలపై అవగాహన

గండేపల్లి: మండలంలోని ఎన్టీ రాజాపురంలో శనివారం లోన్ యాప్ మోసాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక ఎస్సై వై.గణేష్ కుమార్ సైబర్ నేరాలు, లోన్ యాప్ మోసాలపై అవగాహన కల్పించారు. ఎవరైనా బ్యాంక్ నుంచి ఫోన్ చేస్తున్నామని అప్‌డేట్ కోసం ఓటీపీ అడిగితే చెప్పకూడదని హెచ్చరించారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సత్యదేవుని ప్రాకారసేవ

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ప్రాకారసేవ శనివారం ఘనంగా నిర్వహించారు. పండితులు ఉదయం పది గంటలకు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లను తిరుచ్చి వాహనం మీద తూర్పు రాజగోపురం వద్ద గల ఆలయ ప్రాకారంలోకి ఊరేగింపుగా తీసుకువచ్చారు. అక్కడ ప్రత్యేక పూజలు చేసి వేద మంత్రాలు, మంగళవాయిద్యాలు, వందలాది మంది భక్తుల నడుమ ఆలయ ప్రాకారంలో మూడుసార్లు ఊరేగించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ప్రధానాలయానికి చేర్చారు.



జగ్గంపేటలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



శంఖవరంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్



తొండంగిలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

జనం మదిలో రాజన్న పదిలం

- ఘనంగా మహానేత రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు
- గ్రామాల్లో జోరుగా సేవా కార్యక్రమాలు

తుని: దేశంలో ఏ నాయకుడికి దక్కని అరుదైన గౌరవం దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డికి దక్కిందని, ఎప్పటికీ ఆయన ప్రజల హృదయాల్లో చిరంజీవిగా ఉంటారని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. తుని శ్రీరామా సెంటర్లో వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన వైఎస్సార్ జయంతి వేడుకల్లో మంత్రి రాజా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధికి నిలువెత్తు నిదర్శనం రాజశేఖరరెడ్డి అని కొనియాడారు. నాడు తండ్రి నేడు ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు చేస్తున్న సేవలు అజరామంగా నిలుస్తాయన్నారు. రాష్ట్ర పెరికి కార్పొరేషన్ చైర్‌పర్సన్ పురుషోత్తం గంగా భవానీ, తుని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కుసుమంచి సుబ్బరాయులు, గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు కలిదిండి సత్యనారాయణరాజు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యుడు బోడపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలకు ఎమ్మెల్యే తినిపించారు. ఈ సందర్భంగా వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా అమలు చేసిన పథకాలు, ప్రజలకు చేసిన సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పెద్దాడ రాజబాబు, జగ్గంపేట ఎంపీపీ అత్తులూరి నాగబాబు, కిర్లంపూడి ఎంపీప తోట రవి, మండల సచివాలయాల కన్వీనర్ బందారు రాజా, క్రిస్టియన్ మైనారిటీ సెల్ ఉభయగోదావరి జిల్లాల జోనల్ కన్వీనర్ జాన్‌వెస్లీ, రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ డైరెక్టర్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



తుని వైఎస్సార్ జయంతి సభలో మాట్లాడుతున్న మంత్రి దాడిశెట్టి రాజా

ఏలేశ్వరం: స్థానిక పాతబస్టాండ్ వద్ద వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి వైఎస్సార్ సీపీ నాయకులు శిడగం వెంకటేశ్వరరావు, అలమండ చలమయ్య, బొదిరెడ్డి గోపి, సుంకర రాంబాబు తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు సామంతుల సూర్యకుమార్, కోరాడప్రసాద్, పైల విజయ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రత్తిపాడు గ్రామ సచివాలయం వద్ద వైఎస్సార్ విగ్రహానికి జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బెహరా దొరబాబు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లోని రోగులకు, స్థానిక జాతీయ రహదారిపై గల శ్రీశారదా వయో వృద్ధ నిలయంలోని వృద్ధులకు జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, నియోజకవర్గ బీసీ సంఘ నాయకుడు ఎం.నూకరాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యా శ్రీనుబాబు తదితరులు పండ్లు, రొట్టెలు, బిస్కెట్లు పంపిణీ చేశారు.

గండేపల్లి: మండలంలోని మురారి, ఎన్టీ రాజాపురం, యర్రంపాలెం, తాళ్లూరు, గండేపల్లి గ్రామాల్లోని వైఎస్సార్ విగ్రహాలకు ఎంపీపీ చలగళ్ల దొరబాబు, వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒమ్మి రఘురాం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఒబిణ్ణి వీరబాబు, సొసైటీ అధ్యక్షులు కేతిన బాబి, సచివాలయాల మండల కన్వీనర్ తాళ్లూరి మధు తదితరులు పాల్గొన్నారు.

రౌతులపూడి: స్థానిక మార్కెట్ సెంటర్‌లో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ప్రత్తిపాడు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జిగిరెడ్డి రమణమ్మ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జిగిరెడ్డి శ్రీను, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కరబాబు ఆధ్వర్యంలో స్థానిక సీహెచ్‌సీలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. అన్నవరం ట్రస్టుబోర్డు మాజీ డైరెక్టర్ వాసిరెడ్డి జమీలు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఎంపీపీ రాజ్యలక్ష్మి మహానేత విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

తుని రూరల్: ఎస్.అన్నవరంలో డీసీసీబీ డైరెక్టర్ పోలిశెట్టి సోమరాజు, వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్య నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. తేటగుంట, హంసవరం, టి.తిమ్మాపురం, రాపాక, చేపూరు, కేఓ.మల్లవరం, జిల్లేడుపాడు, హెచ్.కొత్తూరు, తాళ్లూరు గ్రామాల్లో వైఎస్సార్ విగ్రహాలకు పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంఆర్‌పీఎస్ నాయకుడు ఆరుగుల మోషే ఆర్థిక సాయంతో సమకూర్చిన బియ్యం, కిరాణా సరుకులు, కూరగాయలను లోవ కొత్తూరులో పేద కుటుంబాలకు సర్పంచ్ లంక వెంకటలక్ష్మి పంపిణీ చేశారు. జేసీఎస్ ఇన్‌చార్జ్ నకురు నాగేంద్ర నెహ్రూ, ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు పోతుల లక్ష్మణ్, నాయకులు చోడ్రాజు రాంబాబురాజు, నాగం దొరబాబు, తమరాన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఒమ్మంగిలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి వైఎస్సార్ సీపీ మండల నేత రామిశెట్టి చినబాబు ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు.

గోకవరం: మండలంలో ఎంపీపీ సుంకర శ్రీవల్లి, వీరబాబు దంపతుల ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతి వేడుకలు నిర్వహించారు. స్థానిక పాతబస్టాండ్ సమీపంలోని వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ఎంపీపీ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎంపీపీ దంపతులు 50 మంది మహిళలు, వృద్ధులకు చీరలు, స్వీట్లు పంపిణీ చేశారు. సచివాలయాల మండల కన్వీనర్ దాసరి రమేష్, ఎస్సీసెల్ జోనల్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలు, దాసరి చిన్నబాబు, సుంకర వెంకటరమణ, కర్రి సూరారెడ్డి, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

కిర్లంపూడి: మండలంలోని బూరుగుపూడి, గోనేడ, పాలెం గ్రామాల్లోని వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు పూలమాల ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ తోట రవి, అల్లు విజయ కుమార్, దోమాల గంగాధర్, జనపరెడ్డి బాబు, భూపాలపట్నం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తొండంగి: మండలంలోని తొండంగి, కొత్తపాకలు గ్రామాల్లో వైఎస్సార్ విగ్రహాలకు వైస్ ఎంపీపీ నాగం గంగబాబు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏవీ నగరం, ఎ.కొత్తపల్లి, పెరుమాళ్లపురం, రావికంపాడు, పైడికొండ, బెండపూడి గ్రామాల్లో జరిగిన వైఎస్సార్ జయంతి వేడుకల్లో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొయ్యా మురళి, వైఎస్సార్ సీపీ యూత్ కన్వీనర్ అరుమిల్లి ఏసుబాబు, మద్దుకూరి వీరవెంకటసత్యనారాయణ, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యుడు గాబు రాజు, పార్టీ మత్స్యకార విభాగం నియోజకవర్గ కన్వీనర్ మేరుగు ఆనందహరి, అంగుళూరి సుశీల తదితరులు పాల్గొన్నారు.

కోటనందూరు: బిళ్లనందూరులో ఎంపీపీ లగుడు శ్రీనివాసు, కాకరాపల్లిలో వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర డైరెక్టర్ లంక ప్రసాద్ ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అల్లిపూడిలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతి వేడుకలు నిర్వహించారు.

అన్నవరం: గ్రామంలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి శంఖవరం వైస్ ఎంపీపీ ధారా వెంకటరమణ, అన్నవరం ఉపసర్పంచ్ బొబ్బిలి వెంకన్నబాబు ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు.

దివంగత నేత రాజశేఖరరెడ్డి సేవలు మరువలేం

శంఖవరం: దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రాష్ట్రానికి చేసిన సేవలు మరువలేమని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా శనివారం పలు గ్రామాల్లోని వైఎస్సార్ విగ్రహాలకు ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ లాంటి అనేక పథకాలు ప్రవేశపెట్టి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత వైఎస్సార్ అన్నారు. తండ్రి ఆశయ సాధన కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పర్వత రాజబాబు, సొసైటీ చైర్మన్ కొండమూరి చంటిబాబు, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు ఈగల అప్పారావు, పార్టీ మండల కన్వీనర్ నరాల శ్రీను, సర్పంచులు కూనిశెట్టి మాణిక్యం, ఈగల విజయదుర్గ, కొల్లు సత్తిబాబు, నకురు గుర్రాజు తదితరులు పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



రౌతులపూడిలో వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కట్ చేస్తున్న పార్టీ నాయకులు



మురారిలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



ఎస్.అన్నవరంలో కేక్ కట్ చేస్తున్న డీసీసీబీ డైరెక్టర్ సోమరాజు, నాయకులు



గోకవరంలో పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ శ్రీవల్లి దంపతులు

సంక్షేమమే ఊపిరిగా పాలన



చింతలూరులో మహిళలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- చింతలూరులో గడపగడపకూ మన ప్రభుత్వం

ప్రత్తిపాడు రూరల్: ప్రజా సంక్షేమమే ఊపిరిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని చింతలూరులో శనివారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగితెలుసుకున్నారు. గత నాలుగేళ్లలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రతి కుటుంబానికి వివిధ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరించారు. గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గత నాలుగేళ్లలో జరిగిన అభివద్ధిని చూసి మరోసారి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ రామిశెట్టి చినబాబు, వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను, ఏఎంసీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ పాల్గొన్నారు.

రైతులకు మేలు చేయడమే లక్ష్యం

శంఖవరం: రైతులకు మేలు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. గ్రామంలో నాబార్డు నిధులు రూ.66 లక్షలతో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. రైతుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకుడు కుడుపూడి భరత్, రాష్ట్ర దృశ్య కళల చైర్మన్ కుడుపూడి సత్య శైలజ, ఎంపీపీ పర్వత రాజబాబు, వైస్ ఎంపీపీ ధారా వెంకటరమణ, జెడ్పీటీసీ తరుం రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు ఈగల అప్పారావు పాల్గొన్నారు.

తప్పుడు కథనాలు రాస్తే చర్యలు తప్పవు

ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

శంఖవరం: తనపై లేనిపోని ఆరోపణలు గుప్పిస్తూ వార్తా పత్రికల్లో తప్పుడు కథనాలు రాస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ హెచ్చరించారు. శనివారం తన స్వగ్రామం శంఖవరంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. తనపై తప్పుడు ఆరోపణలు చేస్తూ వార్తా సమాచారం పత్రికలో కథనం రాయడంపై ఆయన మండిపడ్డారు. ఆ పత్రిక యాజమాన్యంపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు పరువు నష్టం దావా వేస్తామన్నారు. తమ పార్టీలోని ఇతర ఎమ్మెల్యేలతో గొడవలు సృష్టించేందుకు ఇలాంటి కథనాలు రాస్తున్నారన్నారు. తాను ఇతర పత్రికలతో సంప్రదించినట్లు వార్త రాశారని, దీనిని నిరూపించాలన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, తాను కుటుంబ, రాజకీయ పరంగా మంచి స్నేహితులమన్నారు. ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డికి, తనకు గొడవలు పెట్టడానికి తప్పుడు వార్తలు రాశారన్నారు. తన పేరు ప్రతిష్ఠలు దెబ్బతీసేందుకు ఇటువంటి వార్తలు రాయడం సమంజసం కాదన్నారు. తప్పుడు కథనాలు రాసే పత్రికలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

యువత క్రీడల్లో రాణించాలి

- రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా
- నియోజకవర్గస్థాయి వాలీబాల్ టోర్నీ ప్రారంభం



తుని రాజా కళాశాల మైదానంలో వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి రాజా

తుని: యువత క్రీడల్లో రాణించాలని, క్రీడాకారులు జాతీయ స్థాయిలో ప్రతిభ చాటేందుకు అవసరమైన సదుపాయాలను ప్రభుత్వం తరపున కల్పిస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. తుని రాజా కళాశాల మైదానంలో తొండంగి ఎంపీపీ అంగుళూరి అరుణ్‌కుమార్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను శనివారం మంత్రి రాజా ప్రారంభించారు. తొండంగి మండలం కొత్తపాకలకు చెందిన అరుణ్‌కుమార్ అతి చిన్న వయస్సులోనే జెడ్పీటీసీ, ఎంపీపీగా పని చేశారని, ఇటీవల అనారోగ్యంతో మరణించారన్నారు. వాలీబాల్ క్రీడాకారుడుగా అరుణ్‌కుమార్ జిల్లా స్థాయిలో గుర్తింపు పొందారని, అందుకే ఆయనకు ఇష్టమైన వాలీబాల్ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఇందుకు రాజా కళాశాల మైదానంలో శాఫ్ ఆధ్వర్యంలో అధునాతన కోర్టు, ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేశామన్నారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని పురస్కరించుకొని డీఆర్‌ఎఫ్ క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేశామని, వర్షాల వలన మ్యాచ్‌లు పూర్తి కాలేదన్నారు. త్వరలో మ్యాచ్‌లు యథావిధిగా కొనసాగుతాయన్నారు. టోర్నీలో పాల్గొన్న క్రికెట్ జట్లకు ఉచితంగా క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, పెరికి కార్పొరేషన్ చైర్‌పర్సన్ పురుషోత్తం గంగా భవానీ, ఎంపీపీ బొప్పన రాము, తుని మండల పార్టీ అధ్యక్షుడు పోతల రమణ, వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాబు, పోతుల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

'సురక్ష'తో అర్హులందరికీ పథకాలు

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- గోనేడలో గడపగడపకూ మన ప్రభుత్వం



గోనేడలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే చంటిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు

కిర్లంపూడి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామాల్లోని అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని గోనేడలో శనివారం సర్పంచ్ అల్లు విజయ కుమార్ అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటిబాబు మాట్లాడుతూ అధికారులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ఏం కావాలో తెలుసుకుని వారి సమస్యలు తీర్చడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. గ్రామానికి చెందిన 440 మంది రైతులకు వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం ద్వారా మంజూరైన రూ.55,63,000 నమూనా చెక్కును ఎమ్మెల్యే చంటిబాబు పంపిణీ చేశారు. తొలుత గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రస్తుతం అందిస్తున్న పథకాలతో పాటు మరిన్ని సంక్షేమ పథకాలు అందించేందుకు మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి, అల్లు శివరామకృష్ణ, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు దోమాల గంగాధర్, జనపరెడ్డి బాబు, భూపాలపట్నం ప్రసాద్, సూది శ్రీను, తోట విష్ణు, ఎంఎస్ కన్వీనర్ పెనగంటి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాలకు ఐటీడీఏ సేవలు కొనసాగించాలి

ప్రత్తిపాడు: ఉప ప్రణాళికా ప్రాంతంలోని గిరిజన గ్రామాలను షెడ్యూల్డ్ ప్రాంతాలుగా గుర్తించి, రంపచోడవరం ఐటీడీఏ సేవలను కొనసాగించాలని 5వ షెడ్యూల్ సాధన సమితి రాష్ట్ర కార్యదర్శి పీఎస్ అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ప్రత్తిపాడులోని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ కార్యాలయంలో శనివారం కాకినాడ జిల్లా నాన్ షెడ్యూల్ ఏరియా ఆదివాసీ నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 800 గ్రామాలను గుర్తించి, వాటిని షెడ్యూల్డ్ గ్రామాలుగా నోటిఫై చేయమని 1976లో అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు కేబినెట్ చేసిన తీర్మానం నేటికీ అమలు కాలేదన్నారు. గతేడాది కొత్త జిల్లాల ఏర్పాటుతో ఉప ప్రణాళికా ప్రాంతం (నాన్ షెడ్యూల్ ఏరియా)లోని ఆదివాసీలు ఐటీడీఏ సేవలను కోల్పోయారన్నారు. ప్రభుత్వం ఆదివాసీలకు రక్షణ కల్పించి, ఈప్రాంతాలను రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో చేర్చాలని పీఎస్ అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. అనంతరం లిబరేషన్ కార్యాలయం నుంచి స్థానిక అల్లూరి సీతారామరాజు జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి, ధర్నా నిర్వహించారు. అఖిల భారత ఆదివాసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రేచుకట్ల సింహాచలం, శంఖవరం ఏరియా ఆదివాసీ సంఘ ప్రతినిధి జర్త ముసలయ్య, లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు, ఆదివాసీ సంఘ నాయకులు బూసర బాలరాజు, కర్రి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషి చేద్దాం

గండేపల్లి: గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సమష్టిగా కృషి చేద్దామని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ చలగళ్ల దొరబాబు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే చంటిబాబు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. గ్రామాలలో ప్రజల అవసరాలను తీర్చేందుకు సంబంధిత అధికారులు చొరవచూపాలన్నారు. ప్రభుత్వ పథకాలు అందని లబ్ధిదారులను గుర్తించి వారికి పథకాలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు కందుల చిట్టిబాబు, ఎంపీటీసీ మద్దిపట్ల రామకృష్ణ, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.